కలగా..కల్యాణ మండపం

- నిర్మాణంపై ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యం
- రోడ్లపైనే శుభకార్యాలు
- ఇబ్బంది పడుతున్న అగనంపూడి వాసులు



అగనంపూడిలో అధునాత వసతులతో కల్యాణ మండపం నిర్మించేందుకు వీలుగా కేటాయించిన స్థలం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడి నిర్వాసితుల సౌకర్యార్థం కల్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చిన ఉక్కు యాజమాన్యం తరువాత ముఖం చాటేయడంపై నిర్వాసితులు గుర్రుగా ఉన్నారు. పదేళ్ల క్రితం కల్యాణ మండపం నిర్మించేందుకు ఉక్కు యాజమాన్యం నిధులు విడుదల చేసి, తరువాత పట్టించుకోపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అగనంపూడితోపాటు వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరం కాలనీల్లో అధునాత వసతులతో కల్యాణ మండపం నిర్మించేందుకు స్టీల్‌ప్లాంట్ రూ.కోటి 20లక్షలు విడుదల చేసింది. పెదగంట్యాడ, గంగవరం కాలనీల్లో ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టినా, కణితి, అగనంపూడిల్లో స్థలాలు సమయానికి అనువైన చోట లభ్యం కాకపోవడంతో నిధులు మురుగుపోయాయి. తరువాత అగనంపూడి సెక్టార్-1 కాలనీలోని డొంకాడలో 12 సెంట్ల స్థలాన్ని సిద్ధం చేశారు. గతంలో స్థలం వివాదంలో ఉండడంతో, తరువాత వివాదం సమసిపోయింది. 2013లోనే స్థలం సిద్ధం చేసి కార్మిక సంఘాలు, స్థానిక ప్రజా సంఘాలు, నిర్వాసిత సంఘాలు యాజమాన్యానికి కల్యాణ మండపం కోసం చొరవ తీసుకోవాలని పలుమార్లు వినతులు సమర్పించారు. జీవీఎంసీ స్థలం ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మించింది.

అగనంపూడిలో 21 నిర్వాసితకాలనీలతో పాటు దువ్వాడ నిర్వాసితకాలనీలు వెరసి 50వేల వరకు జనాభా ఉంది. 2,500 మంది ఉద్యోగులు, వేలాది నిర్వాసిత కుటుంబాలు ఈ పరిధిలో నివాసమంటున్నాయి. స్టీల్‌ప్లాంట్ సెక్టార్లలో శుభకార్యాలు చేసుకోడానికి వీలుగా వేదికలు ఉన్నాయి. అదే అగనంపూడిలో మాత్రం స్టీల్‌ప్లాంట్ నిర్మించిన ఒక్క వేదిక కూడా లేకపోవడంతో నిర్వాసితులు రోడ్ల మీదనే శుభకార్యాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అగనంపూడిని ఆనుకొని పదుల సంఖ్యలో లేఅవుట్లు, కాలనీలు, వందలాది బహుళ అంతస్తులు ఉండడంతో జననివాసాల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో అగనంపూడిలో అనువైన ఫంక్షన్ హాళ్లు లేకపోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అగనంపూడిలో ఫంక్షన్ హాళ్ల నిర్మాణ విషయంలో నిర్లక్ష్యం ధోరణితో ఉక్కు అధికారులు వ్యవహరిస్తుండడంపై అగనంపూడి, దువ్వాడ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు



గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

గాజువాక: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. పాఠశాలలనుంచి హాల్ టికెట్లు అందలేదనే ఫిర్యాదులకు తావు లేకుండా ఆన్‌లైన్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో కూడా పరీక్షలను రాసేందుకు అనుమతించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అనుమతికి ఏదైనా సమస్య వస్తే అక్కడున్న చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిస్తే పరిష్కారమవుతుందని తెలిపారు.

గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 5,375 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంవద్ద పూర్తిస్థాయిలో బెంచ్‌లు, విద్యుత్ సౌకర్యం, మంచినీరు, మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు. తొలిరోజు ఉదయం 8.15 గంటలనుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రంవద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు.

పరీక్షా కేంద్రాలవద్ద పోలీసు ఆంక్షలు

పదో తరగతి పరీక్షా కేంద్రాలవద్ద పోలీస్ ఆంక్షలను విధిస్తూ సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆదివారం ఉత్తర్వులను విడుదల చేశారు. సౌత్ సబ్ డివిజన్‌లోని అన్ని కేంద్రాలవద్ద ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సెక్షన్ 144ను అమలు చేయనున్నట్టు ఏసీపీ తెలిపారు. ఎవరైనా గుమిగూడినా, అనధికారిక సమావేశాలు ఏర్పాటు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు ముగిసేవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయన్నారు.

క్లుప్తంగా

సిద్ధార్థనగర్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా బలిరెడ్డి



నాగేశ్వరరావును అభినందిస్తున్న కాలనీ సంఘం పెద్దలు

కూర్మన్నపాలెం: స్థానిక సిద్ధార్థనగర్ నిర్వహణ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బలిరెడ్డి నాగేశ్వరరావు గెలుపొందారు. రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించిన ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా జె.ఎన్.మూర్తి, సంయుక్త కార్యదర్శిగా టి.సత్యనారాయణ, అడ్వయిజర్‌గా ఆర్.శంకర్‌నాయక్ విజయం సాధించారు.

బాధిత మెకానిక్‌కు బాసట



మెకానిక్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న గాజువాక మెకానిక్‌లు

గాజువాక: విజయనగరంలో ఇటీవల చోటుచేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో నష్టపోయిన టూవీలర్ మెకానిక్ రాపాక కృష్ణకు గాజువాక ప్రగతి టూవీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాసటగా నిలిచింది. అసోసియేషన్ తరఫున కృష్ణకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ ప్రమాదంలో కృష్ణ మెకానిక్ షెడ్డు, అందులోని 15 వాహనాలు దగ్ధమయ్యాయని అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి తెలిపారు. రాష్ట్రంలో ఏ మెకానిక్‌కు ఇబ్బంది వచ్చినా తమ అసోసియేషన్ బాసటగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.దామోదరరావు, వంగపండు గణేష్, సమ్మిడి పైడిరాజు, రెడ్డిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు పదవి



బోర వేణుగోపాల్ గౌతమ్

పెదగంట్యాడ: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బోర వేణుగోపాల్ గౌతమ్, కొరమాటి అన్నవరం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవి ఇచ్చిన హరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

తలారివానిపాలెం అండర్ పాత్‌వేను విస్తరించాలి

అగనంపూడి: జీవీఎంసీ 86, 88 వార్డులను అనుసంధానం చేస్తే రైల్వే ట్రాక్ అండర్ పాత్‌వేను విస్తరించాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు ఎమ్మెల్యే గణబాబును వినతి పత్రంలో కోరాయి. ఈవిషయంలో చొరవ తీసుకోవాలని నాయకులు కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, మొల్లి కోటేశ్వరరావు, చట్టి దేముడు, అప్పలరాజు కోరారు.

బీడీసీ కేంద్రం ఏర్పాటుకు వినతి



కొండా రాజీవ్ గాంధీకి వినతిపత్రం అందిస్తున్న శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని అగనంపూడి పునరావాస కాలనీల్లో విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బీడీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని శ్రీకృష్ణ యువజన సేవా సంఘం నేతలు వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీని కోరారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లి బీడీసీ కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్టు జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మొల్లి వెంకట అప్పారావు, చట్టి దేముడు, మొల్లి కోటేశ్వరరావు, వెంకట అప్పారావు చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

68వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



అమ్మ ఒడి వచ్చిందా లేదా అని విద్యార్థినిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాలనలో లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 68వ వార్డు మిందిలో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనలో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని, అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే లబ్ధి చేకూరేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక..టీడీపీ కార్యకర్తలకూ ప్రభుత్వ లబ్ధి చేకూరుతోందని, దీనిని బట్టే జగన్ పాలన ఎంత పారదర్శకంగా ఉందో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డి పలకరించారు. అమ్మ ఒడి అందుతుందా..బాగా చదువుకుంటున్నావా.. అంటూ ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆరా తీశారు. మరో చోట సదరన్ సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్‌లో జరుగుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి మానసిక దివ్యాంగ విద్యార్థిని తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. కొన్ని చోట్ల వచ్చిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత సచివాలయ సిబ్బందితో పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, జీలకర్ర నాగేంద్ర, ఈటి సురేష్, నంబారు రాజు, రొక్కం వెంకటరావు, రెడ్డిపల్లి చిట్టిబాబు, గుడివాడ ప్రసాద్, టైలర్ ప్రసాద్, డీఎన్నార్ రమణ, పి.వి.రాజు, పాస్టర్ కృష్ణ, రామారావు, పుప్పల లక్ష్మి, గెడ్డం కృష్ణవేణి, మళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పల చినఅప్పారావు సేవలు మరువలేం



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడిగా తిప్పల చిన అప్పారావు సేవలు మరువలేమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆటోనగర్ యూనియన్ ప్రధాని కార్యదర్శి గొందేశి పెదరెడ్డి ఆధ్వర్యంలో తిప్పల చినఅప్పారావు మూడో వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినఅప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, తిప్పల నితీష్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికులను కలసి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే కొండవాలు ప్రాంతాల్లో జోరుగా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా బోర్లను ఏర్పాటు చేశామన్నారు. రోడ్లు, కాలువలు నిర్మించామని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న తిప్పల దేవన్ రెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి ఆర్.హెచ్ కాలనీలోని యాదవవీధిలో వెలసిన శ్రీ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ 16వ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుద్దీ పాలతో సుందరంగా అలంకరించారు. వార్షికోత్సవం సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుల ఒమ్మి సన్యాసిరావు, 87వ వార్డు వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, 70వ కార్పొరేటర్ ఉరుకూటి చందు, డాక్టర్ మహాకుల్, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ సభ్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటు



సీపీఎం నాయకుడు సుబ్బారావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ నాయకుడు, సీపీఎం సీనియర్ నాయకుడు గొల్లపల్లి సుబ్బారావు (74) మృతికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. షీలానగర్‌లో సుబ్బారావు నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆయన పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం మంచి నాయకుడ్ని కోల్పోయిందన్నారు. కార్మికులకు, కర్షకులకు ఎక్కడ అన్యాయం జరిగిన ఆయనే ముందుండే వారన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు యువశ్రీ, బోగాది సన్యాసిరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తదితరులున్నారు.

పలువురు ఘన నివాళులు

కమ్యూనిస్ట్ నాయకులు జగ్గునాయుడు, అయోధ్య రామ్, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, మున్సిపల్ రాష్ట్ర నాయకుడు ఉమామహేశ్వరరావు, సత్యవతి, ఐద్వా నాయకురాలు రమాప్రభ తదితరులు నివాళులర్పించారు. భెల్ (హెచ్‌పీవీపీ) సిటు నాయకులు ఎస్.జగన్నాథరావు, నారపురెడ్డి, అచ్చిన్నానాయుడు యూనియన్ నుంచి తమ సంతాపాన్ని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ నేతకు సత్కారం



రాములు దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

ఉక్కునగరం: పదవీ విరమణ చేసిన స్టీల్ వైఎస్సార్‌టీయూసి ఉపాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ కార్మికుడు మార్టుపూడి రాములును ఘనంగా సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిలు పాల్గొని రాములు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నుంచి కాపాడండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సహకరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ యువ కార్మికులు ఇందల శివ, రాజులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ తరఫున పోరాడాలని కోరారు. దీనిపై మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ఉక్కు సంకల్పంతో పోరాడతాం

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం విశాఖ ఉక్కు జోలికి ఎవరూ రాలేరని, అలా వచ్చిన కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతామని ఏఐటీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద విశాఖ స్టీల్ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 780వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులుకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహ తహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే అన్ని వర్గాల కార్మికులతో పాటు, ఉక్కు నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నందిక తాతారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబాబు, అడిషనల్ జనరల్ సెక్రటరీ మురళీకృష్ణ, కోశాధికారి నాగరాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పల్లా మంగరాజు, డి.కృష్ణ, ఏఐటీయూసీ పర్మినెంట్ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ డొక్కా నరసింగరావు, కోశాధికారి రాజుబాబు, పాడి త్రినాథరావు, రమణకుమార్ ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను పలు గ్రామాల్లో ఆదివారం ఊరేగించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని భక్తులు ఘటాలకు ఘనంగా స్వాగతం పలికారు. పసుపు, కుంకుమ కలిపిన నీళ్లలో పాదాలపై పోసి ఘటాలకు చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. ఇందులో భాగంగా భూలోకమాంబ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమతానగర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లోని ఎనిమిది డిపార్టుమెంట్లలో పని చేస్తున్న నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే పని కల్పించాలని కోరారు. అలాగే వారికి ఉక్కు యాజమాన్యం నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని శ్రద్ధా, కళింగ కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు చెల్లించిన డబ్బులను యాజమాన్యం అట్టే పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తక్షణమే ఫైనల్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించాలని, ప్రమాదశాత్తూ ఎవరైనా మరణిస్తే రూ.20లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కండేపల్లి రాజు, కె వేణుగోపాల్‌రెడ్డి, వి.సన్యాసిరావు, గొందేశివేణురెడ్డి, పేర్ల నూకరాజు, వెంకీ నాయుడు, అప్పలరాజు, రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అక్కిరెడ్డిపాలెం: గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆటోనగర్ చట్టివానిపాలెం సర్వీసు రోడ్డు పక్కన కేబుల్స్ నిర్మాణం చేస్తున్న గోతిలో పడి అంబేద్కర్ నగర్‌కు చెందిన ఏ.సాయి (27) గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడని గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం



69వ వార్డు ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అక్కిరెడ్డిపాలెం: మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. 68, 69వ వార్డు పరిధిలో గల పలు చర్చిల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రీస్తు భక్తులు కర్జూరం మట్టలను చేతపట్టి ఊరేగింపును నిర్వహించారు. క్రీస్తు కీర్తనలతో ర్యాలీలు చేశారు. 68 వార్డు భెల్ టౌన్ షిప్, తుంగ్లా, హరిజనజగ్గయ్యపాలెం, 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, రాంనగర్ తదితర ప్రాంతాల్లో మట్టల ఆదివారం పండుగ ర్యాలీలు నిర్వహించారు.

ప్రధాన లే అవుట్‌లో తొలగిన అడ్డంకులు



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి వేణుగోపాల్

అక్కిరెడ్డిపాలెం: గత పాలక వర్గం వల్ల 23 ఏళ్లు థర్డ్ ఫేజ్ పురోగతి ఎటువంటి మార్పు లేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు ధ్వజమెత్తారు. భెల్ టౌన్ షిప్‌లో గల కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. కార్యదర్శి బి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం పాలకవర్గం కృషితో థర్డ్ ఫేజ్ లే అవుట్‌లో ప్రధాన అడ్డంకులన్నీ తొలగిపోయాయన్నారు. ప్రస్తుతం జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏల ద్వారా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు పొందడానికి కార్యాచరణకై సభ్యుల సహకారం పొందాల్సి ఉందన్నారు. ప్రతీ ఒక్క రాజకీన నేతను కలిసి థర్డ్ ఫేజ్ లే అవుట్‌ల నిర్మాణంకు సహాయ సహకారాలు కోరగా అందరు సానుకూలంగా స్పందించారన్నారు. ప్రతీ పనిలో తమతో కలిసి సహాయ సహకారాలు అందించిన విశ్రాంత సభ్యులు ఏ.రామారావు, పి.శంకర్రావు, ఉమామహేశ్వరరావు, ఖాదర్, డి.పార్వతీశం, డి.నవీన్, టి.ఎల్.నర్సింగరావులకు సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సభ్యులు ఎస్.సాహు, పి.భాస్కరావు, పి.వి.ఎన్.రాజు, వి.ఆస్.ఆర్.మూర్తి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

పెదగంట్యాడ: అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని కండిపల్లి వారి వీధిలో కొత్తగా నిర్మించనున్న సామాజిక భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15లక్షలతో దీని నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. చకచకా దీనిని పూర్తి చేసి స్థానికంగా ఉండే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొన్నారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

గాజువాక: బీజేపీ బూత్ కమిటీలన్నీ బలోపేతం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌కు 11 మంది సభ్యులతో కమిటీలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఈ కమిటీల ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 6న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు శంకరరావు, దీనంకొండ కృష్ణంరాజు, రోహిణి, గిరిజ, వసంత వర్మ, దానేష్, లలిత, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్‌పై శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ప్రాంగణంలో ఇంటర్ విద్యార్థులకు ఫౌండేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. శిక్షణలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్స్, వైద్య సంబంధిత పాఠ్యాంశాలు, ప్రథమ చికిత్స నైపుణ్యాలు వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 10 పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ శిక్షణకు ఇంటర్ (ఏ గ్రూప్) వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని, వివరాలకు 7207953919, 7670858199కు సంప్రదించాలన్నారు.